# సోనియావి మొసలి కన్నీరు!

- కాంగ్రెస్ ప్రభుత్వంలా బీజేపీ చేయడం లేదు
- విద్యార్థులకు నష్టం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది
- కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ, డిసెంబర్17(ఆర్ఎన్ఎ) : విద్యార్థుల పట్ల కాంగ్రెస్ తాత్కాలిక అధ్యక్షురాలు సోనియాగాంధీ మొసలి కన్నీరు కారుస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ధ్వజమెత్తారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ సొంత ప్రజలపైనే యుద్ధం ప్రకటించారని సోనియా వ్యాఖ్యానించడాన్ని నిర్మలా సీతారామన్ తప్పుబట్టారు. ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో ఢిల్లీ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులను తీహార్‌కు జైలుకు పంపిన విషయాన్ని కేంద్ర మంత్రి గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలా బీజేపీ ప్రభుత్వం చేయడం లేదన్నారు. విద్యార్థులకు నష్టం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. సోనియా వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యమని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. జామియా యూనివర్సిటీలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై సోనియా సోమవారం విడుదల చేసిన ప్రకటన యువ శక్తి మేల్కొంటే మార్పు తథ్యమన్నారు. విద్యార్థులు, యువతపై పోలీసుల దాష్టీకంతో మోదీ ప్రభుత్వానికి పతనం మొదలైందని, శాంతి భద్రతలు, రాజ్యాంగ పరిరక్షణ ప్రభుత్వాల బాధ్యత అన్నారు.



అయితే బీజేపీ సర్కారు సొంత ప్రజలపైనే యుద్ధం ప్రకటించిందని విమర్శించారు. యువత హక్కులను అణచివేయడం, రాజకీయ ప్రయోజనాల కోసం మతపరమైన అలజడులు సృష్టించడమే ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టమవుతున్నదన్నారు. స్వయానా ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షానే విభజన స్ఫిబ్రప్తకు రచయితలు అని ఆమె మండిపడ్డారు. ఈశాన్య రాష్ట్రాల్లో పర్యటించేందుకు అమిత్ షాకు ధైర్యం చాలడం లేదని సోనియా అన్నారు. ఈ వ్యాఖ్యలపై తాజాగా సోనియా మొసలి కన్నీరు కారుస్తుందని నిర్మల సీతారామన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## శిల్పారామాల్లో సంస్కృతిసంప్రదాయాల కలబోత

హైదరాబాద్,డిసెంబర్17 (ఆర్ఎన్ఎ): ప్రతీ జిల్లాలో శిల్పారామాలను ఏర్పాటు చేయనున్నామని తెలంగాణ పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడే విధంగా ప్రతీ జిల్లా కేంద్రాల్లో ఎంతో అద్భుతంగా శిల్పారామాలను తీర్చిదిద్దుతామని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహబూబ్‌నగర్, వరంగల్, సిద్ధిపేట జిల్లాల్లో త్వరలోనే మినీ శిల్పారామాలను ప్రారంభించనున్నామని స్పష్టం చేశారు. నగరంలోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా క్రాఫ్ట్ మేళాను మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పై విధంగా స్పందించారు. ఈ క్రాఫ్ట్‌మేళాలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 400 చేనేత హస్తకళా స్టాల్స్‌ను మంత్రి శ్రీనివాస్ గౌడ్ పరిశీలించారు.

## తీరని రెవెన్యూ సమస్యలు

### ఆత్మహత్యలకు పురిగొల్పుతున్న సందర్భాలు

హైదరాబాద్,డిసెంబర్17 (ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రంలో ఇంకా తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆత్మహత్యా యత్నాలు నిత్యకృత్యంగా మారాయి. రెవెన్యూ సమస్యలపై ఆందోళనలు తగ్గడం లేదు. తహసీల్దార్ విజయాయరెడ్డి సజీవ దహనం ఘటన జరిగి ఇంత కాలం అవుతున్నా ఆ ఘటన తర్వాత ఆత్మహత్యా యత్నాలు, అధికారులకు బెదిరింపులు ఆగటం లేదు. నేటికీ తహసీల్దార్ కార్యాలయాల వద్ద, ఆర్డీవో ఆఫీసుల వద్ద చోటు చేసుకుంటున్న ఘటనలు తహసీల్దార్ విజయారెడ్డి సజీవ దహనం ఘటనని గుర్తు చేస్తూనే ఉంది. తాజాగా మరో ఆర్డీవో కార్యాలయంలో పెట్రోల్ బాటిల్ తో వెళ్ళిన రైతులు అక్కడ ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించి కలకలం సృష్టించారు.తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెట్రోల్ పోసుకుని .. గద్వాల జిల్లాలో రైతు ఆత్మహత్యాయత్నంబోధన్ మండలంలోని పెంటకుర్దు గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురు సభ్యులు బోధన్ ఆర్డీఓ కార్యాలయం ముందు ఆత్మహత్య ప్రయత్నం చేశారు.తమ భూమికి సంబంధించిన సమస్యను అధికారులు పరిష్కరించటం లేదని వారు తమవెంట తెచ్చుకున్నపెట్రోల్ ను ఒంటిపై పోసుకున్నారు. ఆఫీసు వద్ద ఉన్న పోలీసులు వెంటనే అప్రమత్తమై పెట్రోలు బాటిళ్లను లాక్కుని వారిని అడ్డుకున్నారు. ఇక బాధితులు చెప్తున్న వివరాల ప్రకారం గ్రామంలోని తమ వ్యవసాయ భూమిలోకి ప్రవేశించే దారిని మూసివేసి, పక్క భూమివారు ఒక గేటును నిర్మించారని సదరు కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినా ఫలితం లేదన్నారు. అధికారులు పట్టించుకోవటం లేదని ఆరోపించారు. వారి మనోవేదనను విన్న బోధన్ ఆర్డీఓ గోపిరామ్ న్యాయం జరిగేలా చూస్తామని బాధిత కుటుంబ సభ్యులకు చెప్పారు. ఇక ఈ వ్యవహారంలో తగిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ను ఆదేశించారు.

## యువత తప్పకుండా ప్రశ్నించాలి: కమల్‌హాసన్

చెన్నై, డిసెంబర్ 17: ఢిల్లీలోని జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీలో పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకించిన విద్యార్థులపై పోలీసుల తీరుపై ఎంఎన్ఎం చీఫ్ కమల్‌హాసన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. తాజా పరిణామాల నేపథ్యంలో కమల్‌హాసన్ మీడియాతో మాట్లాడుతూ..పౌరసత్వ సవరణ బిల్లు చట్టానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలంటే మీరు ఎలాంటి విధానాన్ని అవలంబిస్తారో చెప్పాలని కమల్ ప్రశ్నించారు. దేశంలోని యువతకు రాజకీయపరిణితి ఉంటుంది. ఉండాలి కూడా..విద్యార్థుల్లో తప్పకుండా ప్రశ్నించే నైజం ఉండాలి. ఒకవేళ ప్రశ్నించే తత్వాన్ని అణిచివేస్తే..ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడే అవకాశముంటుందన్నారు. నా రంగంలో నేనొక విద్యార్థిని. ఎంఎన్ఎం పార్టీ తరపున విద్యార్థులు, ప్రజల తరపున నిరంతరం నా గొంతుక వినిపిస్తానని కమల్‌హాసన్ అన్నారు.

# సర్పంచ్‌లు బాధ్యతగా పనిచేయాలి

- పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలి
- అప్పుడే గ్రామాల స్వరూపం మారుతుంది
- కాళేశ్వరంతో గ్రామాలకు నీటి సౌకర్యం
- గ్రామాలకు ట్రాక్టర్లు పంపిణీ చేసిన మంత్రి ఎర్రబెల్లి

భూపాలపల్లి,డిసెంబర్17(ఆర్ఎన్ఎ): సర్పంచ్ పదవి చాలా గొప్పదని, మంచి పేరు తెచ్చుకునేలా పని చేయాలని సర్పంచ్‌లకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వాహణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎవరైనా గీత దాటితే జరిమానాలు విధించాలన్నారు. సర్పంచ్‌లు గ్రామాలను పరిశుభ్రంగా, పచ్చదనంతో నింపాలని దిశానిర్దేశం చేశారు.

తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలిచిందని మంత్రి అన్నారు. పల్లె ప్రగతితో తెలంగాణ రాష్ట్రం పారిశుధ్యంలో ఉత్తమ అవార్డుకు ఎంపికైందని చెప్పారు. జిల్లాలోని గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్ల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు.. సీఎం కేసీఆర్‌పై ప్రశంసల జల్లు కురిపించారు. అసాధ్యమనుకున్న తెలంగాణను కేసీఆర్ తన ఉద్యమ పటిమతో సాధించారన్నారు.

తెలంగాణ జీవధార అయిన కాళేశ్వరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేసి గ్రామాలను సస్యశ్యామలం చేశారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు కోర్టుకు వెళ్లి అడ్డంకులు సృష్టించినా.. వాటన్నింటినీ ఎదుర్కొని కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మిషన్ భగీరథ పథకంతో గ్రామాలకు మంచినీటిని అందిస్తున్నామని చెప్పారు. సీఎం కేసీఆర్ విధానాలతో రైతులకు, వ్యవసాయం చేసే వారికి గుర్తింపు లభించిందన్నారు. పేదలు, వృద్ధులు, ఒంటరి మహిళలు, నేత-గీత కార్మికులకు ఆసరా పథకంతో అండగా ప్రభుత్వం నిలిచిందన్నారు. ఉపాధి హామీ పథకంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. గ్రామాల్లో పనులు కొనసాగేందుకు అవసర మైన నిధులు ఉన్నాయని చెప్పారు.

జనవరి 2 నుంచి 11 వరకు పల్లె ప్రగతి రెండో దశ మొదలు కానుందని మంత్రి దయాకర్ రావుతెలి పారు. ప్రతి సర్పంచ్ దీనిని సవాల్‌గా తీసుకుని పల్లె ప్రగతిని విజయవంతం చెయ్యాలన్నారు. అభివృద్ధి చెందిన గ్రామాలకు ప్రత్యేక ప్రోత్సాహకం ఉంటుందని చెప్పారు. పల్లెల ప్రగతి కోసం ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అమలు చేస్తున్న ప్రణాళికలు సత్ఫలితాలు అందించాయి. జిల్లా కలెక్టర్ దగ్గరి నుంచి పంచాయతీ సెక్రటరీ వరకు ఊరంతా తిరిగి పనులను గుర్తించి వాటిపై నివేదికను రూపొందిం చారు. పబ్లిక్ రోడ్లు, మురుగు కాల్వలు, అడవుల నిర్వహణ, శిథిలాలు, పిచ్చి మొక్కల తొలగింపు, వీధి దీపాల నిర్వహణ వంటి ప్రాధాన్యత గల సమస్యలన్నీ ఒక్కోటి పరిష్కారం అయ్యాయి. సెప్టెంబర్ ఆరో తేదీన ప్రారంభమైన 30 రోజుల ప్రణాళిక జిల్లా వ్యాప్తంగా ఆచరణలో అద్భుతంగా ముందుకు సాగింది.

ఏకధాటిగా నెల రోజులు సాగిన తొలి దశ పల్లె ప్రగతిలో ప్రభుత్వ యంత్రాంగం, పంచాయతీ పాలకవవర్గాలు, గ్రామప్రజలు తమ ఊరి బాగు కోసం నడుం బిగించారు. స్వచ్ఛందంగా తోచిన పనిచేసి అద్భుతంగా తీర్చిదిద్దారు. శ్రమదానంతో గ్రామాన్ని బాగు చేసుకున్నారు. తొలి విడతలో సాధించిన పల్లె ప్రగతిని స్ఫూర్తిగా తీసుకుని జనవరి రెండో తేదీ నుంచి జిల్లా అంతటా జనవరి 11వ తారీఖు వరకు మరోమారు ఈ కార్యక్రమం ఉధృతంగా నిర్వహించనున్నట్లు మంత్రి ఎర్రబెల్లి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఛైర్మన్ పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్‌గా ఏడాది పూర్తి

- పార్టీ కార్యక్రమాలపై కెటిఆర్ మార్క్
- యువతను ఆకట్టుకునేలా కార్యక్రమాలు

హైదరాబాద్,డిసెంబర్17(ఆర్ఎన్ఎ): టిఆర్ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చాక పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన కెటిఆర్ అటు పార్టీ బాధ్యతలను, ఇటు మంత్రిగా తన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ అందరి మన్ననలను అందుకుంటున్నారు. పార్టీలో బలమైన నేతగా ఉంటూ,క్యాడర్‌ను ఉత్తేజపరుస్తున్నారు. ముఖ్యంగా పార్టీలో సీనియర్లను కలుపుకుని పోతూనే యువకులకు మంచి అవకాశాలు కల్పిస్తున్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేశారు.

మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఘన విజయం సాధించేలా పార్టీని వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సర్వసన్నద్ధం చేశారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఇప్పటికే ఇంఛార్జ్‌లను నియమించారు. క్షేత్రస్థాయి పరిస్థితులపై నివేదికలు తెప్పించుకున్నారు. మున్సిపాలిటీలో రాజకీయ పరిస్థితులపై చర్చించారు. పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడానికి తరచు పార్టీ ప్రధాన కార్యదర్శులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. పార్టీపై, ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేసే తప్పుడు ప్రచారాలు, విమర్శలను సమర్థవంతంగా తిప్పికొట్టేలా నాయకులకు సూచనలు ఇస్తున్నారు. మొత్తానికి బాధ్యతలు స్వీకరించిన యేడాదిలోనే టీఆర్ఎస్ ను తిరుగులేని శక్తిగా కేటీఆర్ తీర్చిదిద్దారు. అటు అన్ని జిల్లాల్లో పార్టీ కార్యాలయాల నిర్మాణాన్ని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. పార్టీ సభ్యత్వం 60 లక్షలు దాటే దిశగా నాయకుల్లో ఉత్సాహం నింపటమే కాకుండా దేశంలోనే తక్కువ సమయంలో ఎక్కువ సభ్యత్వాన్ని నమోదు చేసిన పార్టీగా టీఆర్ఎస్‌ను నిలిపారు. పోలింగ్ బూత్, గ్రామ, వార్డు, డివిజన్, మండలస్థాయి కమిటీలను పూర్తి చేయించి పార్టీని మరింత బలోపేతం చేశారు. సామాజిక బాధ్యతగా అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటర్లుగా నమోదు చేయించుకోవడం కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇక హుజూర్ నగర్ ఉప ఎన్నిక విజయం టీఆర్ఎస్‌కు అత్యంత ప్రతిష్టాత్మ కమైనదిగా చెప్పాలి. కీలక సమయంలో పార్టీ వాణిని ప్రజల వద్దకు తీసుకుపోయేలా కేటీఆర్ చేసిన వ్యూహరచన తిరుగులేని ఫలితాన్నిచ్చింది. నియోజకవర్గంలో కేటీఆర్ తొలుత రోడ్ షోలు నిర్వహించారు. టెలికాన్ఫరెన్సుల్లో ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించారు. కార్యకర్తలకు సూచనలు చేస్తూ ముందుకు నడిపించటంతో టీఆర్ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి భారీ మెజార్టీతో గెలిచారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులతో పాటు వివిధ బిల్లులు, రిజర్వేషన్ల అంశంపై టీఆర్ఎస్ ఎంపీలకు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిశానిర్దేశర చేశారు. పార్లమెంట్ సమావేశాలకు ముందు వారితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వ పరంగా తీసుకున్న చర్యలను వివరిస్తూ వారికి సమాచారాన్ని అందించారు. ఈ సమాచారం పార్లమెంట్ వేదికగా కేంద్రాన్ని నిలదీయటానికి టీఆర్ఎస్ ఎంపీలకు దోహదపడింది.

# అన్ని అవయవాలు సరిగ్గా ఉండి సమాజానికి హాని చేసేవారే అసలైన వికలాంగులు

హైదరాబాద్, డిసెంబర్ 17: అన్ని అవయవాలు సరిగ్గా ఉండి, సమాజానికి హాని తలపెట్టే వారే అసలైన వికలాంగులని గిరిజన, స్త్రీ-శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. నగరంలో నిర్వహించిన మానసిక వికలాంగుల సాంస్కృతిక సంబరాల కార్యక్రమానికి మంత్రులు కొప్పుల ఈశ్వర్, సత్యవతి రాథోడ్ హాజరై, ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. అనేక మంది బిడ్డలు వారు చేయని తప్పులకు మానసిక వికలాంగులుగా ఉన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరిలో సంతోషం చూడాలని సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని మంత్రి అన్నారు.

మానసిక వికలాంగులలో 18 ఏళ్ళు నిండిన తర్వాత కూడా ఎలాంటి మార్పు ఉండదు. 18 ఏళ్లు నిండిన తర్వాత వీరిని కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరం. సీఎం కేసీఆర్ గారు మానవతావాది. వీరి సమస్యలను ఖచ్చితంగా ఆయన దృష్టికి తీసుకెళ్తే న్యాయం చేస్తారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వీరికి 3,016 రూపాయల పెన్షన్లు ఇస్తున్నామని మంత్రి అన్నారు.

తెలంగాణ ఏర్పాటు కాకముందు వికలాంగులకు 3 శాతం రిజర్వేషన్లు ఉంటే ప్రభుత్వం వచ్చాక ఒక శాతం పెంచి 4 శాతం రిజర్వేషన్లు కల్పించారు సీఎం కేసీఆర్. మానసికంగా, శారీరకంగా ఇబ్బంది పడుతున్న వీరిని పెంచడం తల్లిదండ్రులకు సవాల్. వేరే వ్యాపకం లేకుండా వీరిని చేసుకోవాల్సి వస్తుంది. అన్ని అవయవాలు సరిగ్గా ఉన్నా తమ బుద్ధిని సరైన దిశలో పెట్టలేని వారే అసలైన బుద్ధి మాంధ్యులని మంత్రి అన్నారు. చేయని తప్పుకు శిక్ష అనుభవిస్తున్నా అందరితో సమానంగా ఎదిగేందుకు ప్రయత్నిస్తున్న వీరు కాదు వికలాంగులని మంత్రి తెలిపారు. గౌరవ సీఎం గారు రాష్ట్రంలో అందరూ సంతోషంగా ఉండేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. వీరి సంతోషం కోసం కూడా ఆయన అన్ని చర్యలు తీసుకుంటారని తాను విశ్వసిస్తున్నట్టు మంత్రి



పేర్కొన్నారు.

సాంఘిక సంక్షేమ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాటాడుతూ.. అనుకోకుండా వారి జీవితంలో లోటు కలిగి మానసిక వికలాంగులుగా ఉండడం దయనీయ పరిస్థితి అని అన్నారు. వీరిని పెంచడం వారి తల్లిదండ్రులకు చాలా కష్టంతో కూడుకున్న పని. జీవితకాలం వీరిని పసిపిల్లలుగా చూసుకోవాలి. మానసిక వికలాంగులను చేరదీసి తల్లిదండ్రులుగా చూసుకొంటూ వారి కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థల సేవలు వెల కట్టలేనివని ఆయన అన్నారు. 10,50,000 మంది దివ్యాంగులలో 54,000 మంది మానసిక వికలాంగులు ఉన్నారనీ, వీరి రక్షణ, సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకొంటోంది అని మంత్రి అన్నారు.

ఎన్జీవోల సహకారంతో మానసిక వికలాంగుల కోసం హైదరాబాద్ తో పాటు మూడు, నాలుగు జిల్లాలకు ఒక సెంటర్ ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. మానసిక వికలాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇచ్చి వారి బాగు కోసం పని చేస్తుందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్త్రీ-శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జగదీశ్వర్, వికలాంగుల శాఖ డైరెక్టర్ శైలజ, ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ జాయింట్ డైరెక్టర్ సబిత, రంగారెడ్డి జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ మోతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జనాభా రెట్టింపు.. లోక్‌సభ స్థానాలను వెయ్యికి పెంచాలి

హైదరాబాద్, డిసెంబర్ 17:: దేశ జనాభాకు అనుగుణంగా లోక్‌సభ స్థానాల సంఖ్యను 543 నుంచి వెయ్యికి పెంచాలని, తదనుగుణంగా రాజ్యసభ సభ్యుల సంఖ్యను కూడా పెంచాలని మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఎన్నికైన లోక్‌సభ సభ్యులు, ఓటర్ల మధ్య నిష్పత్తిలో భారీ అసమానతలు ఉన్నాయన్నారు. ఇండియా ఫౌండేషన్ సోమవారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో మాజీ ప్రధాని ఏబీ వాజపేయి ద్వితీయ స్మారకోపన్యాసం చేస్తూ 1971 జనగణన ప్రకారం 55 కోట్ల జనాభా ఉన్నప్పుడు చివరిసారిగా 1977లో లోక్‌సభ సభ్యులను 543కు పెంచామని ఆయన తెలిపారు. ఇప్పుడు జనాభా రెట్టింపు సంఖ్యను దాటి పోయింది కనుక లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో స్థానాల పెంపుపై నిషేధాన్ని తొలిగించాల్సిందేనన్నారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయి ఏకాభిప్రాయ నిర్మాణం నిష్ణాతుడన్నారు. ఇన్నాళ్లలో అనేక పార్టీలకు ఓటర్లు పట్టం కట్టారని, కానీ ఏ ఒక్క పార్టీకి కూడా ఓటర్లు 50 శాతం ఓట్లను కేటాయించలేకపోయారన్నారు. స్థిరమైన ప్రభుత్వం కావాలంటే సంఖ్యా బలం అవసరమని, మెజారిటీ లేని పక్షంలో కీలక నిర్ణయాలు తీసుకోలేమన్నారు. ఎన్నికైన ప్రతినిధుల నిష్పత్తికి, దేశంలోని ఓటర్ల మధ్య చాలా వ్యత్యాసం ఉందని ప్రణబ్ తెలిపారు. జనాభా రెట్టింపు అయిన సందర్భంగా లోక్‌సభ స్థానాల సంఖ్యను కూడా పెంచాలని సూచించారు.

# నిర్భయ కేసునుంచి తప్పుకున్న సీజే

- నేడు మరో ధర్మాసనుంచే విచారణ
- ఆ మృగాలను క్షమించొద్దు
- సుప్రీంకు నిర్భయ తల్లి విజ్ఞప్తి

న్యూఢిల్లీ, డిసెంబర్17(ఆర్ఎన్ఎ) : నిర్భయ కేసు నిందితుడు అక్షయ్ కుమార్ వేసిన రివ్యూ పిటిషన్‌పై విచారణ ఊహించని మలుపు తిరిగింది. ఈ కేసు విచారణ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఎ బాబ్డే తప్పుకున్నారు. విచారణ ప్రారంభమైన కొద్దిసేపటికే ఆయన ఈ మేరకు నిర్ణయించుకోవడంతో ఈ కేసు తాత్కాలికంగా వాయిదా పడింది. బాధితురాలి తరపున ఈ కేసులో ఒకప్పుడు తన కోడలు వాదించినందున ఈ కేసులో తాను తీర్పు ఇవ్వలేనని సీజే పేర్కొన్నారు. బుధవారం 10:30 గంటలకు ఈ కేసుపై మరో ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తానని.. అక్షయ్ కుమార్ రివ్యూ పిటిషన్‌పై నూతన బెంచ్ విచారణ జరుపుతుందని ఆయన తెలిపారు. నిర్భయ కేసులో ఉరిశిక్ష పడిన నలుగురు నిందితుల్లో ఒకడైన అక్షయ్ సింగ్ సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేసిన విషయం విదితమే. తనకు విధించిన మరణ శిక్షను సమీక్షించాలంటూ అక్షయ్ సింగ్ తన న్యాయవాది ఏపీ సింగ్ ద్వారా సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేశాడు. తనను తప్పుగా దోషిగా నిర్ధారించారని, పలు దేశాల్లో ఉరిశిక్షలను రద్దు చేశారంటూ పలు న్యాయ సంబంధిత వాదనలను అందులో పేర్కొన్నాడు. ఢిల్లీలో నెలకొన్న వాయు కాలుష్యంపైనా అందులో ప్రస్తావించాడు. ఢిల్లీలో వాయు,నీటి కాలుష్యం వల్ల ఎలాగూ జీవితం హరించుకుపోతున్నదని, ఇక ఉరిశిక్షలు ఎందుకని ప్రశ్నించాడు. సత్యయుగంలో ప్రజలు వెయ్యేండ్లపాటు జీవించేవారంటూ హిందువులకు సంబంధించిన వేదాలు, పురాణాలు, ఉపనిషత్తుల గురించి కూడా పిటిషన్‌లో పేర్కొన్నట్లు సమాచారం.

ఆ మృగాలను క్షమించొద్దు - సుప్రీంకు నిర్భయ తల్లి విజ్ఞప్తి

2012 ఢిల్లీ గ్యాంగ్ రేప్ కేసులో నిందితుడొకరు వేసిన రివ్యూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరిస్తుందని ఆశిస్తున్నట్టు నిర్భయ తల్లి పేర్కొన్నారు. తమ కుటుంబానికి సాధ్యమైనంత వేగంగా న్యాయం చేయాలని ఆమె కోరారు. నిర్భయ కేసు దోషుల్లో ఒకడైన అక్షయ్ కుమార్ సింగ్.. తనకు విధించిన ఉరిశిక్షను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. ఈ నేపథ్యంలో మంగళవారం నిర్భయ తల్లి స్పందించారు. కోర్టు తప్ప మాకు వేరే ఆధారం లేదు కాబట్టి మాకు న్యాయం జరుగుతుందని నమ్ముతున్నాం. అతడి (అక్షయ్) పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరిస్తుందని నేను ఆశిస్తున్నానని అన్నారు. దోషులు తప్పించుకోవడానికి ఇక ఒక్క అవకాశం కూడా లేదు. ఈ కేసును సాగదీసేందుకే వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారని ఆమె పేర్కొన్నారు. 2017 ఉన్నావ్ రేప్ కేసులో బీజేపీ బహిష్కృత ఎమ్మెల్యే కుల్దీప్ సెంగార్, సహనిందితులకు ఉరిశిక్ష విధించాలనీ.. తద్వారా దేశ వ్యాప్తంగా గట్టి సందేశం అందాలని నిర్భయ తల్లి పేర్కొన్నారు.

# ఎన్‌కౌంటర్ వ్యవహారంలో కోర్టుల తీరు సరికాదు!

- పోలీసుల మనోధైర్యాన్ని దెబ్బతీయొద్దు
- టీఆర్ఎస్ ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు

హైదరాబాద్,డిసెంబర్17(ఆర్ఎన్ఎ):దిశ నిందితుల ఎన్‌కౌంటర్ వ్యవహారంపై టీఆర్ఎస్ నేతలు కొందరు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఎమ్మెల్యే గొంగిడి సునీత, మంత్రి ఈటల రాజేందర్ తదితరులు తప్పుబట్టారు. అయితే, తాజాగా దీనిపై టీఆర్ఎస్ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు స్పందించారు. ఈయన ఎన్‌కౌంటర్ చర్యకు అనుకూలంగానే మాట్లాడినా.. ఈ వ్యవహారంలో కోర్టుల తీరును తప్పుబట్టి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు మాట్లాడుతూ.. నిందితుల ఎన్‌కౌంటర్ వ్యవహారంలో కోర్టుల తీరు సరికాదని అభిప్రాయపడ్డారు. ఇది పోలీసుల మనో ధైర్యాన్ని దెబ్బ తీసినట్లవుతుందని పేర్కొన్నారు. వెటర్నరీ డాక్టర్ దిశ హత్య కేసులో ప్రజలు ఏం కోరుకున్నారో.. పోలీసులు అదే చేశారని విద్యాసాగర్‌రావు స్పష్టం చేశారు. అయితే, దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై టీఆర్ఎస్‌లో భిన్నమైన వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఎన్‌కౌంటర్‌ను మంత్రి ఈటల, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత తప్పుబట్టడం గమనార్హం. నల్గొండ జిల్లా ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునిత కొద్ది రోజుల క్రితం ఎన్‌కౌంటర్‌పై మాట్లాడుతూ.. ఈ ఘటన వల్ల నిందితుల తల్లిదండ్రులు ఎంతగా భాదపడి ఉంటారో.. అంటూ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా నిందితుల కుటుంబాలకు తాను ప్రగఢ సానుభూతిని వ్యక్తం చేస్తున్నట్టు ప్రకటించారు. అత్యాచారాల వంటి నేరాలకు ఉరి శిక్ష వేయడం, కాల్చి చంపడం వంటివి శాశ్వత పరిష్కారం కావని ఈటల రాజేందర్ అన్నారు. దిశ లాంటి ఘటనలు జరగకుండా ఉండాలంటే.. ముందు సమాజంలో మార్పు రావాలని ఆశించారు.

# అందుకు ఎలాంటి మార్గదర్శకాలు లేవు!

- మైనారిటీల గుర్తింపుపై పిల్‌ను తోసిపుచ్చిన సుప్రీం

న్యూఢిల్లీ, డిసెంబర్17(ఆర్ఎన్ఎ) : జాతీయ గణాంకాల ప్రాతిపదికన కాకుండా రాష్ట్రాల వారీగా జనాభా ఆధారంగా మైనారిటీ వర్గాలను నిర్ణయించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం తోసిపుచ్చింది. సామాజిక ప్రయోజనాలను పొందేందుకు ఎనిమిది రాష్ట్రాల్లో హిందువులను మైనారిటీలుగా పరిగణించాలని ఈ పిటిషన్ కోరింది. పలానా రాష్ట్రంలో ఏ వర్గాన్ని మైనారిటీలుగా పరిగణించాలనే విషయంలో ఎలాంటి మార్గదర్శకాలు లేవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బీజేపీ నేత, అడ్వకేట్ అశ్విని ఉపాధ్యాయ్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌కు అటార్నీ జనరల్ మద్దతు పలకలేదు. కాగా రాష్ట్ర జనాభాకు అనుగుణంగా మైనారిటీ వర్గాన్ని గుర్తించాలని దాఖలైన ఈ పిటిషన్‌కు సంబంధించి సహకరించాలని జులైలో అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్‌ను సుప్రీం కోర్టు కోరింది. అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గగోయ్ నేతృత్వంలోని సుప్రీం బెంచ్ అటార్నీ జనరల్ కార్యాలయానికి పిటిషన్ కాపీని అందించాలని పిటిషనర్, బీజేపీ నేతను కోరుతూ విచారణను నాలుగు వారాల పాటు వాయిదా వేసింది. ముస్లిలు, క్రిస్టియన్లు, సిక్కులు, బుద్ధులు, పార్సీలను మైనారిటీలుగా పరిగణిస్తూ 26 ఏళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ చట్టబద్ధతను ఈ పిటిషన్ సవాల్ చేసింది.

# తిరుమలలో రద్దీ సాధారణం

తిరుమల,డిసెంబర్17(ఆర్ఎన్ఎ): తిరుమల తిరుపతి దేవస్థానంలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది.

వైకుంఠంలోని 9 కంపార్ట్‌మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. శ్రీవేంకటేశ్వరస్వామివారి సాధారణ సర్వదర్శనానికి 8 గంటల సమయం, టైమ్‌స్లాట్ టోకెన్లు పొందిన భక్తులకు 3 గంటల సమయం పడుతుంది. స్వామివారిని నిన్న 66,597 మంది భక్తులు దర్శించుకున్నారు. 24,389 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. శ్రీవారి హుండీ ఆదాయం సోమవారం రూ. 2.93 కోట్లుగా లెక్కించారు.

# అన్యమత ప్రచారంలో లోకేశ్ హస్తం

- తిరుమల కొండపై శిలువ ఉందని నిరూపిస్తే రాజీనామా చేస్తా
- శాసనమండలిలో మంత్రి వెల్లంపల్లి సవాల్
- ఆరోపణలు రుజువు చేయకపోతే వెల్లంపల్లి రాజీనామా చేస్తారా?
- మంత్రికి సవాల్ విసిరిన లోకేష్

అమరావతి, డిసెంబర్17(ఆర్ఎన్ఎ) : టీటీడీలో అన్యమత ప్రచారంపై ఏపీ శాసనమండలిలో చర్చ జరిగింది. ఈ క్రమంలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం, సవాల్ ప్రతి సవాళ్లు చోటు చోటుచేసుకున్నాయి. అన్యమత ప్రచారంలో లోకేష్ హస్తం ఉందని మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ ఆరోపించారు. సోషల్ మీడియా ద్వారా లోకేష్ అన్యమత ప్రచారం చేయిస్తూ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాలని స్కెచ్ వేశారని వెల్లంపల్లి చెప్పుకొచ్చారు. తిరుమల కొండపై శిలువ ఉందని నిరూపిస్తే రాజీమా చేస్తానని వెల్లంపల్లి సవాల్ విసిరారు. శిలువ లేకపోతే లోకేష్ రాజీనామా చేస్తారా..? అని వెల్లంపల్లి అసెంబ్లీ వేదికగా సవాల్ చేశారు. సవాల్‌కు మండలిలోనే ఉన్న నారా లోకేష్ స్పందించారు. ఆరోపణలు రుజువు చేయకపోతే వెల్లంపల్లి రాజీనామా చేస్తారా అని మంత్రికే లోకేష్ ప్రతి సవాల్ విసిరారు. మరోవైపు.. మంత్రి చేసిన వ్యాఖ్యలు నిరూపించాల్సిందేనని టీడీపీ సభ్యులు పట్టుబట్టారు. ఈ సందర్భంగా మళ్లీ వెల్లంపల్లి కలుగజేసుకుని.. టీటీడీ కొండపై శిలువ సోషల్ మీడియా క్రియేటివిటీ అని స్పష్టం చేశారు. మత విద్వేషాలు రెచ్చగొట్టాలని టీడీపీ కుట్ర పన్నిందని.. టీటీడీలో అన్యమత ప్రచారం జరిగిందనేది అవాస్తవమని తేల్చిచెప్పారు. తిరుమల వెంకటేశ్వరస్వామితో రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు. ఇప్పటికే నాశనం అయ్యారని.. ఆలయాల జోలికి వస్తే ఇంకా నాశనం అవుతారని టీడీపీని ఉద్దేశించి వెల్లంపల్లి వ్యాఖ్యానించారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com